క్లుప్తంగా

దవులూరికి వర్ధినీడి కృతజ్ఞతలు



జిల్లా అధ్యక్షురాలు సుజాత దంపతులను సత్కరించిన దొరబాబు

సామర్లకోట: జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత శనివారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సుజాత దంపతులు దొరబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సుజాత దంపతులను దొరబాబు సత్కరించి మహిళలకు వైఎస్సార్ సీపీ ఇస్తున్న ప్రాధాన్యం, పథకాలను ప్రతీ ఒక్కరికి తెలియ జేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, హుస్సేన్ పురం ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ వారా సుధాకర్, పవర పార్టీ అధ్యక్షుడు నాగవబోయిన రాజబాబు, గృహ సారథుల మండల కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, గోపు మురళీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీకి సత్కారం



ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీని సత్కరించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శనివారం సత్కరించారు. సామర్లకోట పార్టీ కార్యాలయంలో దొరబాబును ఆమె మర్యాద పూర్వకంగా కలిసారు. దాంతో ఆమెను అభినందించి సత్కరించారు. కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దొరబాబును కలిసిన కొప్పన

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు కొప్పన విశ్వనాథ్ శనివారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును కలుసుకున్నారు. స్థానిక దొరబాబు క్యాంప్ కార్యాలయంలో విశ్వనాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి దొరబాబును సత్కరించారు.

ఆర్థిక సహాయం అందజేత



మృతుని భార్యకు ఆర్థిక సాయం చెక్కు అందజేసిన మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిప్రసాద్

సామర్లకోట: స్థానిక గణపతినగరానికి చెందిన కార్మికుని కుటుంబానికి శనివారం రాత్రి పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల పెద్దాపురం సైరస్ ఫ్యాక్టరీలో సామర్లకోటకు చెందిన కార్మికుడు గొరిశెట్టి రాజు మృతి చెందిన విషయం తెలిసిందే. అతని మృతికి పరిహారంగా కుటుంబానికి రూ.12 లక్షలు చెల్లిస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం హామీ ఇచ్చిన నేపథ్యంలో చెక్కును మృతిని భార్యకు సాయిప్రసాద్ అందజేశారు. కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

కౌన్సిలర్లతో డీఈ

- పాత ఇనుప సామగ్రి అమ్మేసుకున్న మున్సిపల్ డీఈపై కౌన్సిల్ మండిపాటు
- గరంగరంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



పిఠాపురం మున్సిపల్ సమావేశంలో డీఈపై అసహనం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: రూ.లక్షల విలువ చేసే పాత ఇనుప సామాన్లను మున్సిపల్ అధికారులకు గాని, సభ్యులకు గాని తెలియకుండా అమ్మేసుకున్న మున్సిపల్ డీఈపై కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగింది. తొలుత అధికారులు ఎజెండాలో పొందుపరచిన అంశాలను చదివి వినిపించగా కౌన్సిలర్ సోమరౌతు లలిత పాత ఇనుప సామాన్లు (స్క్రాప్) విక్రయించిన విషయంపై నిజాలు నిగ్గు తేల్చాలని పట్టుబట్టారు. దీంతో మున్సిపల్ డీఈ భవాని శంకర్ మాట్లాడుతూ పాత ఇనుప సామాన్లు అమ్మకంలో ఎటువంటి అవినీతి జరగలేదని, ఎవరూ అపోహలు పడాల్సిన పనిలేదని చెప్పడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు అవినీతి గురించి ఎవరూ అడగలేదని, ఎవరికీ తెలియకుండా 11 నెలల క్రితం సామాన్లు అమ్మి ఇప్పుడు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. రూ 50 లక్షల విలువైన సామగ్రిని రహస్యంగా అమ్మి సొమ్ము చేసుకోవడం వెనుక అవినీతి కచ్చితంగా ఉంటుందన్నారు.

కౌన్సిల్ సభ్యుల అవినీతి బయటపెడతా

పాత ఇనుప సామగ్రి అంత రహస్యంగా ఎందుకు అమ్మాల్సి వచ్చింది, ఎంతకు అమ్మారు, ఎవరికి అమ్మారు వంటి వివరాలు ఇక్కడే చెప్పాలని సభ్యులు నిలదీశారు. దీనిపై డీఈ మాట్లాడుతూ అవినీతి గురించి మాట్లాడితే సభ్యుల అవినీతి బయటపెడతానని, ఒక వ్యక్తికి రూ.65 వేలు ఇచ్చానని సభలో చెప్పడంతో సమావేశంలో దుమారం రేగింది. ఏ వ్యక్తికి డబ్బులు ఇచ్చారు, సభ్యుల అవినీతి ఎంటో బయటపెట్టాలని కౌన్సిలర్లు బొజ్జా జగదీశ్వరి, బోను దేవ, పెదపాటి నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి తదితరులు పట్టుబట్టారు. దీంతో సుమారు గంట పాటు వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిపై మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి స్పందిస్తూ సభ్యులను కించపరుస్తూ మాట్లాడడం మంచిది కాదన్నారు. అసలు విషయాన్ని చెప్పడంతో పాటు సభ్యులకు క్షమాపణ చెప్పాలని డీఈకి సూచించారు. డీఈ మాట్లాడుతూ సభ్యులు అవినీతికి పాల్పడినట్లు తాను అనలేదన్నారు. పాత సామాన్లు అమ్మకంపై పూర్తి వివరాలతో మూడు రోజుల్లో లిఖిత పూర్వకంగా సమాధానం ఇస్తానని చెప్పారు. సభ్యులను ఏమన్నా తప్పుగా అని ఉంటే క్షమించాలని కోరారు. అయినప్పటికీ రూ.65 వేలు తీసుకున్న వ్యక్తి వివరాలు బయటపెట్టాలని కొందరు సభ్యులు పట్టుబట్టడంతో డీఈ సమావేశం నుంచి వెళ్లిపోయారు. సభకు గౌరవం ఇవ్వకుండా ఆయన చేసిన పనిపై చర్చ జరుగుతుంటే కనీసం చైర్మన్ పర్మిషన్ లేకుండా అధికారి అయిన డీఈ బయటకు వెళ్లి పోవడం కౌన్సిల్‌ను అవమానించడమే అంటూ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. చివరకు కమిషనర్ ఎం.రామ్మోహన్ సర్ది చెప్పడంతో ఎజెండాలో అంశాలపై చర్చ జరిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, కమిషనర్ ఎం.రామ్మోహన్ పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కాలనీ కాదు.. జగనన్న ఊరు అనిపించేలా..

- మౌలిక వసతుల కల్పనకు సత్వర చర్యలు
- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి



జగనన్న కాలనీలను ఉద్దేశించి మాట్లాడుతున్న దొరబాబు

పెద్దాపురం: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు తన వంతు కృషి చేస్తానని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణ శివారు జి.రాగంపేట జగనన్న కాలనీలో శనివారం కందుల దేవి, సూరిబాబు దంపతులు నిర్మించిన ఇంటిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది ఇళ్లు నిర్మించేలా ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం నిర్వహించిందన్నారు. జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేసి కాలనీ కాదు.. ఊళ్లు అనే విధంగా తీర్చిదిద్దుతున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ గోపు మురళీలు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పవరలో ఎంపీడీఓ పరిశీలన..

సామర్లకోట: మండల పరిధిలో పవర గ్రామంలోని జగనన్న కాలనీని ఎంపీడీఓ డి.శ్రీలలిత శనివారం పరిశీలించారు. పవర హౌసింగ్ లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న 68 ఇళ్లను ఉగాది నాటికి పూర్తి చేసుకోవాలని ఆమె లబ్ధిదారులకు ఆదేశించారు. వెలుగు అధికారుల ద్వారా మహిళా సంఘాల్లో ఉన్న 40 మందికి రుణాలు మంజూరు చేయించి చెక్కులను అందజేశారు. సోమవారం నుంచి పనులు వేగవంతం చేస్తామని లబ్ధిదారులు ఎంపీడీఓకు తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నాగవబోయిన రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి పూర్తి చేయాలి

జగనన్న కాలనీలు ఉగాది నాటికి పూర్తయ్యేలా చూడాలని డీఎల్‌పీఓ పి. నారాయణమూర్తి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశమై లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం రూ.1.8 లక్షలు ఇస్తుందని, మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకులు రూ.35వేలు ఇస్తున్నాయని తెలిపారు. ఈ మొత్తానికి లబ్ధిదారులు కొంత మొత్తం జమ చేసుకొంటే మంచి ఇళ్లు కట్టుకో వచ్చని తెలిపారు. కార్యదర్శులు విధులకు రాగానే హాజరు వేయాలని ఆదేశించారు. పట్టణ పరిధిలో అనేక సచివాలయాల కార్యదర్శులు, వలంటీర్లు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. డ్రెస్ కోడ్‌తో వార్డులో పర్యటిస్తున్న సమయంలో సచివాలయ సిబ్బంది సర్వేకు వస్తున్నట్లు ప్రజలకు తెలుస్తుందన్నారు. కమిషనర్ నయీం అహ్మద్, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత పాల్గొన్నారు.

పోలీసులకు ప్రశంసా పత్రాలు

కొత్తపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన స్థానిక పోలీస్టేషన్ సిబ్బంది యు.పాపారావు, వి.సత్తిబాబులకు శనివారం జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరు విధులు నిర్వహిస్తుండగా ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో కొండెవరం సమీపంలోని ఒక మోటారు సైకిల్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులు ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టారు. వీరిలో ఇద్దరికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ముగ్గురు కాకినాడ నగరంతో పాటు పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లుగా గుర్తించి వారిని అరెస్టు చేసి కాకినాడ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్పీ వీరిని అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.





ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న, కొత్తపల్లి పోలీసులు పాపారావు, సత్తిబాబు

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న, ఎంపీపీ కారే సుధ



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- ఎంపీపీ కారే సుధ
- వాడీవేడిగా మండల సమావేశం

కొత్తపల్లి: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కారే సుధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సుధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ సూచించారు. శ్రీరాంపురం సర్పంచ్ రావి రమేష్ మాట్లాడుతూ శ్రీరాంపురం, రావివారిపోడు, ముమ్మిడివారిపోడు గ్రామాలు గతంలో కేఎస్ఈజెడ్ పరిధిలో ఉండడం వలన అర్హులైన వారికి ఇళ్లస్థలాలు కేటాయించలేదన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి రుణాలను మంజూరు చేయాలని, విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయాలని కోరారు. ఎండపల్లి ఎంపీటీసీ బర్రే రవి మాట్లాడుతూ జొన్నల గరువు, కొండెవరం ఇంద్రకాలనీల్లో గృహాలపై ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ల వల్ల ఇప్పటికే ఒక విద్యార్థి ప్రమాదశాత్తు మృతి చెందాడని, పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలన్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ ప్రమోద్ స్పందిస్తూ త్వరలోనే ఎస్టిమేషన్ వేసి గృహాలపై లైన్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే అమరవల్లి, పొన్నాడ లే అవుట్లను పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉచితంగా విద్యుత్ మీటర్ ఇస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని పాత ఇసుకపల్లి సర్పంచి సన్నిబోయిన రిబ్కా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందడం లేదన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిపై ఎంపీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నిధులను కేటాయిస్తున్నామన్నారు. ఇటీవల ఉప్పాడ, అమీనాబాద్, మూలపేటతో పాటు పలు గ్రామాల్లో పందులకు వైరస్ సోకి మృతి చెందుతున్నాయని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎంపీడీఓ భాస్కరరావు, తహసీల్దార్ గిడుతూరి ప్రసాద్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- డీఏఓ విజయకుమార్
- మామిళ్లదొడ్డి, కొప్పవరాల్లో పొలాలను పరిశీలించిన అధికారులు



సామర్లకోట మండలంలో నీటి ఎద్దడి ఉన్న పొలాలను పరిశీలించిన జేడీ విజయకుమార్

సామర్లకోట: జిల్లాలో సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ తెలిపారు. మండల పరిధిలో అనేక గ్రామాల రైతులు సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారనే ఆందోళన మేరకు మామిళ్లదొడ్డి, కొప్పవరం గ్రామాల్లో దాళ్వా వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ డీఈ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సాగునీటి సమస్యను వివరించారు. గోదావరి జలాలతో పాటు వివిధ డ్రైన్లలో నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా అందించడానికి అధికారులు అంగీకరించారని తెలిపారు. సాగునీటి కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని ధైర్యం చెప్పారు. ఈనెల 25 లోపు ఈ-క్రాప్, ఈకేవైసీ, పీఎం కిసాన్ ఈకేవైఎస్ నమోదు చేయించుకున్నవారి మాత్రమే పీఎం కిసాన్ ఈకేవైఎస్ పథకం వర్తిస్తుందన్నారు. ఏడీ జీవీ పద్మశ్రీ, మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, ఏఈఓ ఎంవీ సతీష్, రైతు సంఘ నాయకులు వింటి రాంబాబు, నంగినీడి పెద్దకాపు, మార్ని రామకృష్ణరాజు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆదాయం రూ.2.8 లక్షలు

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అన్నదానం, విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు 2,80,444 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచె బుచ్చిరాజుతో పాటు, సుమారు పదివేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.


వసతి గృహంలో తనిఖీలు



విద్యార్థినితో మాట్లాడుతున్న జిల్లా జడ్జి వాసంతి

పిఠాపురం: స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను శనివారం పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి ఆకస్మికంగా తనిఖీ చేయబూరు. విద్యార్థులతో మాట్లాడి హాస్టల్‌లో వసతులపై ఆరా తీశారు. విద్యాభ్యాసం, వ్యాయామం, ఆటలు వంటి విషయాలు, భోజనం, కాస్మోటిక్స్ తదితర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సౌకర్యాలు, భోజనం సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వసతి గృహ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు కొంగు సూకరాజు, సీహెచ్ రమణి, రాంబాబు, సీఏ వైఆర్‌కే శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల పైనుంచి పడి విద్యార్థి మృతి



మహేంద్ర (ఫైల్)

కొత్తపల్లి: పాఠశాల భవనం పైనుంచి ప్రమాదవశాత్తు పడి, ఒక విద్యార్థి మృతి చెందిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. ఉప్పాడ శివారు కొత్తపట్నానికి చెందిన మైల భూలోక కుమారుడు మహేంద్ర (12) కొత్తపల్లి జెడ్పీ హైస్కూలులో 6వ తరగతి చదువుతున్నాడు. అనారోగ్యంగా ఉండటంతో రెండు రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదు. శుక్రవారం సాయంత్రం ఇంటి దగ్గరలోని ప్రాథమిక పాఠశాల భవనం ఎక్కి ఆడుకుంటూండగా ప్రమాదశాత్తు కింద పడి, తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తీసుకువెళుతూండగా మహేంద్ర మార్గం మధ్యలోనే మృతి చెందాడు. దీనిపై తమకు ఎటువంటి సమాచారమూ లేదని కొత్తపల్లి పోలీసులు చెప్పారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

పిఠాపురం: న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐఎల్‌యూ) మహా సభలో వక్తలు డిమాండ్ చేశారు. పిఠాపురం 12వ అదనపు జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభలో ఐఎల్‌యూ రాష్ట్ర కార్యదర్శి సూకల వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు మేడపాటి ధర్మారెడ్డి మాట్లాడారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రత కోసం ఐఎల్‌యూ కృషి చేస్తోందన్నారు. న్యాయవాదులపై ఇటీవల కాలంలో దాడులు పెరిగిపోయాయని, న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం పిఠాపురం పట్టణ ఐఎల్‌యూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షుడిగా ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్, అధ్యక్షుడిగా ఆర్‌వీ రమణారావు, ప్రధాన కార్యదర్శిగా గుదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు, ఉపాధ్యక్షులుగా ప్రేమ సునందరావు, జీవీవీ సత్యనారాయణ, కార్యదర్శులుగా కొంగు సూకరాజు, ఎస్‌కే అబ్రిష, ట్రెజరర్‌గా సీహెచ్ మనో, సభ్యులుగా గుబ్బల సురేష్‌బాబు, రావుల రమేష్, కృష్ణవేణి, రేగసరాజు, శాస్త్రి, గౌతు రాజా, పుల్లరాజు, వైవీఎస్ మూర్తి, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రేపు కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షత వహిస్తారన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.